ప్రజాశక్తి
శుక్రవారం 31 మార్చి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు



చదువుల్లో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

నూరుశాతం ఫలితాల సాధన లక్ష్యంగా కృషి

పది పరీక్షలకు కసరత్తు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయి. కరోనా వల్ల మూడేళ్లుగా పరీక్షలు సవ్యంగా జరగక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది ఎటువంటి ఆటంకాలూ లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 138 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 456 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 27,714 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేశారు. వీరిలో 14,693 మంది బాలురు, 13,093 మంది బాలికలు ఉన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల నుంచి 11,788 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 15,928 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 29 స్టోరేజీ పాయింట్‌లను ఏర్పాటు చేశారు.

ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8.45 నుంచి 9.30 వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆ తరువాత ఒక్కనిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. 1500 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారు. ఈ ఏడాది ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు మాత్రమే ఉన్నాయి. ప్రతి పేపరుకు ఒకటి లేదా రెండ్రోజుల సెలవులు వచ్చాయి. అందువల్ల విద్యార్థులకు చాలా వెసులుబాటు ఉంది. 100 మార్కులకు ఒకే పేపరు ఉంటుంది. అయితే ప్రశ్నల సంఖ్య పెరగకుండా ప్రశ్నలకు మార్కులు పెంచారు. ప్రతి సబ్జెక్టులో 32 ప్రశ్నలు ఉంటాయి. 24 పేజీల బుక్ లెట్ ఉంటుంది. అవసరమైతే అడిషనల షీట్స్ కూడా ఇస్తారు.

ప్రత్యేక తరగతుల నిర్వహణతో సిలబస్‌కూడా పూర్తి చేయగలిగారు. గతేడాది 65 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత రాగా ఈఏడాది 100 శాతం ఫలితాల సాధన లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు గత కొన్ని నెలలుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. గతేడాది కంటే ఈఏడాది మెరుగైన ఫలితాల సాధించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లక్ష్యాలను నిర్ధేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించారు. మార్చి 9 నుంచి ప్రీఫైనల్స్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో 'సి' కేటగిరి నుంచి ఈ కేటగిరి వరకు ఉన్న దాదాపు ఆరు వేల మంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. ప్రతి ఒక్కరికి బెంచిలు ఏర్పాటు చేయాలని కోరింది. పరీక్షల నిర్వహణకు రాష్ట్ర పరిశీలకులుగా పి.పార్వతి నియమితులయ్యారు. ఏర్పాట్లను కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

4 లో

జావగారిపోతున్న భోజన కార్మికులు

- రాగిజావ తయారీకి నిర్వాహకులకు అదనంగా చాకిరీ, గ్యాస్ ఖర్చు
- రోజుకు ఐదారు గంటలు పని చేస్తే దక్కుతున్న గౌరవవేతనం రూ.100



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం) : 6.26

సహరీ (శనివారం ఉదయం) : 4.46

పల్నాడు మహిళకు నంది పురస్కారం



మహాలక్ష్మికి పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరిస్తున్న ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి-నరసరావుపేట

కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల రాజమండ్రిలో వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలను అందించిన వారికి నంది పురస్కారాలను ప్రదానం చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు చెందిన కారచోల మహాలక్ష్మి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్ట మొదటి మహిళా ఫొటోగ్రాఫర్‌గా నంది అవార్డును సినీ నటులు, దర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి నుండి అందుకున్నారు.

మహిళలు రాణించలేని వృత్తిగా భావించే ఫొటోగ్రఫీలో మహాలక్ష్మీ 30 ఏళ్ల క్రితమే తన 11వ ఏటలో ప్రవేశించి కొన్ని వేల ఫొటోలను తీశారు. హైదరాబాద్‌లో ఆసరా ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన ఐ స్టాండ్ ఫర్ ది నేషన్ శ్రేష్ఠ పురస్కారాన్ని గతంలో అందుకున్నారన్నారు. ఫొటోగ్రఫీ ద్వారా తనకు వచ్చిన ఆదాయంలో కొంత సమాజాభ్యున్నతికి కేటాయిస్తున్నారు. నరసరావుపేటలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎడిట్ పాయింట్ సంస్థ వీరి జీవితం మొత్తాన్ని ఒక కథనంగా 'దటీజ్ మహాలక్ష్మి' పేరుతో పుస్తకాన్ని ప్రచురించారు. ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక సభ్యులు డాక్టర్ ఎస్‌పి భారతి, ఆర్.నారాయణమూర్తి గుర్తు చేసి మహాలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు.

పాడిరైతుకు గ(డ్డి)డ్డుకాలం

పశుగ్రాసం దొరక్క అవస్థ - అధిక ధరలకు కొనలేక పశువులను తెగనమ్ముకోవాల్సిన దుస్థితి

ప్రజాశక్తి - నరసరావుపేట

పశువులపై మక్కు వతో పాడి పరిశ్రమను ఆదాయ మార్గంగా ఎంచుకొని ముందుకు సాగుతున్న పశు పోషకులకు ఎండుగడ్డి కొరత కారణంగా నష్ట పోవాల్సి వస్తోంది. వరి గడ్డి అందుబాటులో లేక రూ.వేలకు వేలు వెచ్చించి కోనుగోలు చేయలేక పశువులను పస్తులుంచాల్సిన దుస్థితి నెలకొంది. అయినా ఆకలితో ఉన్న మూగ జీవాలను చూడలేక ప్పులు చేసి మరీ వరి గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితులను ప్రభుత్వం, అధికారులు గుర్తించాలని, పాడిరైతులకు ఎండుగడ్డిని రాయితీపై అందించాలని పశుపోషకులు కోరుతున్నారు.

వ్యవసాయ రంగంలో పెరిగిన యాంత్రీకరణతో ఎండు గడ్డికి గడ్డు రోజులు దాపురించాయి. వ్యవసాయ రంగంలో వస్తున్న నష్టాల నేపథ్యంలో వరి సాగుకు అన్నదాతలు ముందుకు రాకపోవడం ఒక కారణమైతే యంత్రాలతో కోత వల్ల ఎండుడ్డి లభ్యత తగ్గింది. నరసరావుపేట నియోజకవర్గంలో ఖరీఫ్‌లో వెయ్యి ఎకరాలకు పైగా వరి సాగైంది. మండలంలో వ్యవసాయాదారిత కుటుంబాలు ఓ మోస్తారుగా ఉన్నా పాడి పరిశ్రమ బాగానే కొనసాగుతుంది. మండలంలో సుమారు 8 వేలకు పైగా పాడి పశువులు ఉన్నాయి. వీటికి సరిపడా పశుగ్రాసం దొరక్క పశు పోషకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్నవారు డెల్టా ప్రాంతాల నుండి దిగుమతి చేసుకుంటుండగా ఒక

2లో





'సీతారాముల జీవితం ఆదర్శం'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సీతారాముల జీవితం ప్రపంచానికి ఆదర్శం అని తెలుగు దేశం పార్టీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా నగరంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముని జీవితం తరతరాలకు ఆదర్శం, స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఆదర్శవంతమైన జీవనాన్ని కొనసాగించేందుకు శ్రీరామనవమి ఒక ప్రత్యేక సందర్భం అని చెప్పుకొచ్చారు. ఇచ్చిన మాట కోసం కష్టాలు ఎదురైనా వెరవక విలువలను ఆచరించి, ధర్మాన్ని కాపాడిన మహనీయుడని తెలిపారు. లోక కల్యాణం కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఆదర్శదంపతులు సీతారాములని, వారి జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో తాడివాక సుబ్బారావు, పరుచూరి రాము,రవి,నవీన్ కష్ణ,రమేష్, రామకష్ణ, నారాయణ, దలై బాబు, సాంబశివరావు,ప్రభాకర్, రామకష్ణ, వేదాంత శ్రీనివాసరావు, గడ్డిపాటి రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ముగిసిన సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

జేఎన్టీయూకే, స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీల సంయుక్తంగా నిర్వహించిన సెంట్రల్ జోన్ టోర్నమెంట్-2023 క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. పురుషుల, మహిళా విభాగాలలో వేరు వేరుగా వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు పోటీలు నిర్వహించిన విషయం విధితమే. విశాఖ, తూర్పు, పశ్చిమ, కష్ణా గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెం దిన వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి ఈ పోటీలకు 198 జట్లు పోటీపడినట్లు సెంట్రల్ జోన్ టోర్నమెంట్-2023 చైర్మన్, కళాశాల ప్రిన్సిపల్ డా. జి.వి. ఎస్.ఎన్. ఆర్.వి. ప్రసాద్ తెలియజేశారు. బుధవారం రాత్రి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ పోటీలు ఆహూతులను పరవశింపజేశాయి. ఏ క్రీడకు అదే ఎంతో వైవిధ్యంగా సాగి నట్లు, లీగ్ పద్ధతిలో వివక్షకు తావు లేకుండా ఫైనల్ జట్లను ఎంపిక చేసినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మత్తి శివ శంకర్ తెలిపారు. విద్యార్థులతో పాటుగా ఆయా కళాశాలల ఫీజికల్ డైరెక్టర్స్ 55 మంది, జిల్లా విద్యా ధికారి సహకారంతో కష్ణా జిల్లా నుండి వివిధ పాఠశాలలో ఉన్న వ్యాయామోపాధ్యాయులను రిఫరీలుగా నియమించి నట్లు కన్వీనర్ డా. పి.కోదండ రామారావు తెలిపారు. పురు షుల విభాగంలో వాలీబాల్ క్రీడలలో విన్నర్స్ గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలాజి, రాజమండ్రి, రన్నర్స్ ప్రగతి ఇంజనీరింగ్ కాలేజ్, సూరంపాలెం, కబడ్డీ లో విన్నర్స్ అమత సాయి ఇంజనీరింగ్ కాలేజ్, పరిటాల, రన్నర్స్ శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్, గుడ్లవల్లేరు, టేబుల్ టెన్నిస్ లో విన్నర్స్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ, రన్నర్స్ శ్రీ వాసవి ఇంజనీరింగ్ కాలేజ్, తాడేపల్లిగూడెం, బాల్ బ్యాడ్మింటన్ లో విన్నర్స్ శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్, గుడ్లవల్లేరు, రన్నర్స్ ఎస్.ఆర్.కె. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విజయవాడ నిలిచాయి. మహిళా విభాగంలో వాలీబాల్ క్రీడలలో విన్నర్స్ శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్, గుడ్లవల్లేరు కాగా రన్నర్స్ సింట్ మెరిస్, గుంటూర్, కబడ్డీ లో విన్నర్స్ శేషాద్రి రావు గుడ్ల వల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్, గుడ్లవల్లేరు నిలవగా రన్నర్స్ కాకినాడ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కాకినాడ నిలిచాయి. విజేతలకు ట్రోఫీలను సెంట్రల్ జోన్ టోర్నమెంట్ - 2023 చైర్మన్ డా. జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్, కన్వీనర్ డా.పి.కోదండ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, కళాశాల డైరెక్టర్ డా. బి.కరుణ కుమార్, యాజమాన్య సలహాదారులు డా. పి. రవీంద్ర బాబు చేతుల మీదుగా అందజేశారు.

కెఎల్‌యులో ఫ్లాష్ మాబ్.. ఆకట్టుకున్న ఆటపాటలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

భావ, భాష వ్యక్తీకరణ చేయడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నాయ కత్వ లక్షణాలు వెలికి తీయవచ్చునని కేఎల్ విశ్వ విద్యాలయం బిఎ ఐఎఎస్ విభాగం అధి పతి డాక్టర్ వెంకటేశ్వర కుమార్ అన్నారు. బుధవారం విద్యా ర్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ కార్యక్రమం అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ నెల 31న జరగబోయే జాతీయస్థాయి సాంస్కృతిక యువ జనోత్సవాలను పుర స్కరించుకొని విద్యార్థులు ఈ ఫ్లాష్ మ్యాబ్ ను నిర్వ హించినట్లు తెలిపారు. వడ్డేశ్వరం లోని కెఎల్ యు క్యాం పస్ లో నిర్వ హించిన ఫ్లాష్ మాబ్ లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులు తమ ఆట పాట లతో, నృత్యాలతో ఆకట్టు కున్నారు. అనంతరం విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై ర్యాలీతో విజయవాడ చేరుకుని ట్రెండ్ సెట్ మాల్ లో కూడా ఫ్లాష్ మాబ్ నిర్వ హించారు. విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలు, విన్యా సాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తించారు.


కెఎల్‌యులో ఫ్లాష్ మాబ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాడిరైతుకు గ(డ్డి)డ్డుకాలం


ఎండుగడ్డి కట్టలు

(మొదటి పేజీ తరువాయి)

ట్రాక్టర్ ఎండుగడ్డి దాదాపు రూ. 12-15 వేల వరకు పలుకుతుండడంతో అప్పులు చేసి మరీ కొనుగోలు చేస్తున్నారు. అంత పెట్టలేని వారు విధిలేని పరిస్థితుల్లో తమ గేదెలను తక్కువ ధరకు తెగ నమ్ముకుంటున్నారు.

దీనికి తోడు వాగుల దగ్గర చెరువుల కింద బోరుబావులున్న రైతులు పచ్చిగడ్డి సాగు చేసి సాధారణ ధరలకు గడ్డిని కొనుగోలు చేసినా పాడి పరిశ్రమ గిట్టుబాటు కావడం లేదు. పాడి రైతులు అప్పులు చేసి పచ్చిగడ్డిని దూర ప్రాంతాల


కోత యంత్రం ద్వారా వరి కోయగా చిత్తు గడ్డిని కట్టలు కడుతున్న ట్రాక్టర్

నుండి ఎండు గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ఎండుగడ్డి వ్యాపారులు వివిధ గ్రామాల్లో ధరలను అమాంతం పెంచుతున్నారు. భవిష్యత్తులో ఎండుగడ్డి ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. దీంతో పాటు దాదాపు ఆరు నెలలు (వచ్చే వర్షకాలం నాటికి) ఎండుగడ్డి కొరత ఉంటుందని అందుకే తప్పని పరిస్థితుల్లో అప్పులు చేసి మరి కొనుగోలు చేస్తున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశుపోషణ భారమైంది

పి.రవికుమార్. అన్నవరం, రొంపిచర్లమండలం.



గతంలో 8 ఆవులు, 6 గేదెలను పోషించాం. గతంలో రాయితీపై సైలేజ్ గడ్డి అందించడంతోపాటు పశు గ్రాస క్షేత్రాల పేరుతో రాయితీలు కల్పించి పశు పోషకులకు నూతన గడ్డి వంగడాలను అందించేవారు. ప్రస్తుతం అవి లేకపోవడంతో పశుపోషణ భారమైంది. గిట్టుబాటు కాకపోవడంతో ఆవులు గేదెలు అమ్మి బ్రతుకుదెరువు కోసం ఇతర ఆదాయ మార్గాలు చూసుకుంటు న్నాం. అనారోగ్యం, విద్యుద్ఘాతం కారణంగా 4 పశువులు మృతి చెందడంతో మరింత నష్టం వచ్చింది. బీమా ఇస్తామని అధికారులు చెప్పినా ఇప్పటికీ అందలేదు.

రాయితీలు ఇవ్వాలి..

మహిళా పాడిరైతు. ఎం.శారద, ఇక్కుర్రు, నరసరావుపేట మండలం



సొంత పొలం లేకపోయినా 6 పశువులను మేపుతూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాం. పెరిగిన ఎండుగడ్డి ధరలతో కొనలేక కేవలం ఎండు గడ్డి కోసం కొంత పొలం కౌలుకు వరి సాగు చేశాం. తీరా యంత్రాలతో కోత కోయాల్సి రావడంతో గడ్డి దక్కలేదు. ఇతర



ప్రాంతాల నుండి ఎండుగడ్డి కొనుగోల చేయాలంటే ఒక ఎకరా ఎండుగడ్డి ఇంటికి చేరేనాటికి రూ.15 వేలు అవుతోంది. దాణా, తవుడు ఇతర మిశ్రమ దాణాలు ధరలు పెరిగినా పాల ధరలు పెరగక పోవడంతో పాడి పరిశ్రమ గిట్టుబాటు కావడం లేదు. ఇతర ప్రాంతాల నుండి 3 ఎకరాల లో వరిగడ్డి కొనుగోలు చేస్తే కూలీల ఖరీదు, రవాణా ఛార్జీలు ఇతరాత్ర ఖర్చులు కలిపి రూ 50 వేలు దాటింది. ఈ ఖర్చులన్నీ భరించలేక కుటుంబం గడవడం కష్టమై వేరే కూలి పనులకు కూడా వెళ్లాల్సి వస్తుంది.



రసవత్తరంగా జగ్గయ్యపేట 'బార్' ఎన్నికలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు రసవత్తంగా మారాయి. జరగనున్న జగ్గయ్యపేట బార్ అసోసియేషన్‌లో మొత్తం 69 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఇద్దరు ప్రెసిడెంట్ పదవికి, మరో ఇద్దరు జనరల్ సెక్రటరీ పదవికి పోటీలో ఉన్నారు. మిగిలిన పదవులు ఏకగ్రీవం అయ్యాయి. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా అన్నేపాక సుందర్‌రావు, అన్నేపాక కాంతారావు పోటీ పడుతుండగా, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అభ్య ర్థులుగా ఎలమంచిలి నాగ రాజేంద్రప్రసాద్, మెట్టెల వీరాంజనేయులు పోటీపడుతున్నారు. అన్నేపాక సుందర్‌రావు గతంలో ఐదు సంవత్సరాలు పాటు బార్ ప్రెసిడెంట్‌గా చేసిన అనుభవంతో పాటు గతంలో చేసిన అభివృద్ధి పనులు తనను గెలిపిస్తాయని ధీమాతో ఉన్నారు. అన్నెపాక కాంతారావు గతంలో ప్రెసిడెంట్‌గా పోటీ చేసి ఓడిపోవడం, మరోమారు జనరల్ సెక్రటరీగా పోటీ చేసి గెలుపొందడం జరిగింది. సీనియర్ న్యాయవాదిగా న్యాయవాదులతో తనకున్న సన్నిహిత సంబంధం దృష్ట్యా తాను గెలుస్తానని గెలుపు ధీమాతో అన్నారు. ఇప్పటికే ప్రచారం గడువు ముగియగా ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నారు. 69 మంది న్యాయవాదుల్లో 9 మంది న్యాయవాదులు న్యూట్రల్‌గా ఉన్నారు. ఈ తొమ్మిది మంది న్యాయవాదుల ఓట్లు ఎవరికి పడితే వారే గెలుస్తారని తెలుస్తుంది. గెలుపు ఓటములు తెలియాలంటే శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు వేచి చూడాల్సిందే.

అభివృద్ధికి కృషి : సుందరరావు

కోర్టులో ఇతర అభివృద్ధి పనులతో పాటు న్యాయవాదులకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామని సుందరరావు తెలిపారు. కోర్టులో సిబ్బంది తక్కువగా ఉన్నందున పెరిగిన పని భారంపై న్యాయమూర్తుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. గతంలో తాను ప్రెసిడెంట్ గా ఉన్న సమయంలో మంజూరైన బార్ అసోసియేషన్ స్థలంలో బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. న్యాయవాదులకు ప్రభుత్వం నుండి గాని ప్రభుత్వేతర సంస్థల నుండి గాని లబ్ధి చేకూర్చేలా చూస్తానన్నారు.

సంక్షేమానికి పెద్దపీట : కాంతారావు

తాను బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైతే న్యాయవాదుల ఆత్మ గౌరవాన్ని కాపాడతానని కాంతారావు చెప్పారు. ప్రతి న్యాయవాది సంరక్షణ కోసం బార్‌కు కావలసిన అన్ని వసతులు, న్యాయవాదులకు వచ్చినటువంటి కష్టాన్ని బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి తీర్చుటకు ప్రయత్నం చేస్తానన్నారు. బార్ కు బెంచ్ కు తారతమ్యం లేకుండా అందరినీ సమానంగా ఉండేటట్లు చూడటం, న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు ప్రభుత్వం నుండి రావలసిన సౌకర్యాలను న్యాయవాదులు అందించడం, బార్ లో కావలసిన వసతులు న్యాయవాదులందరుతో కలిసి సమిష్టిగా పనిచేసి వాటిని సంపాదించుకోవడం జరుగుతుందన్నారు.

కాయ్ ...రాజా కాయ్...

- తెనాలి కేంద్రంగా విస్తరిస్తున్న నంబర్ల లాటరీ
- రోజూ లక్షల్లో వ్యాపారం.. నష్టపోతున్న పేదలు
- గతంలో కేసు నమోదు చేసికూడా కట్టడి చేయని పోలీసులు

ప్రజాశక్తి-తెనాలి

జూదం..ఇది మనిషి అతి పెద్ద బలహీనత. దాన్నే ఆదాయ వనరుగా చేసుకునే ప్రభుద్దులు ఎందరో. దానికి అధికార పార్టీ నాయకులు మినహాయింపేమీ కాదు. దాదాపు అన్ని ప్రాంతాల్లో కనిపించే పేకాటలో రమ్మీ, కోతముక్క, కోడిపందాలు, అష్టాచెమ్మా ఇలాంటివే జూదం అనుకుంటే పొరపాటే. దీనికి తెనాలి కొత్త పట్టణం కొత్త బాష్యం చెబుతోంది. అదేమంటే నెంబర్ లాటరీ..పెద్ద మాయాజాలయం. లాటరీ టిక్కెట్ కొనండి..లక్షాదికారులు కండి..కాయ్ రాజా కాయ్ అంటూ నిర్విఘ్నంగా నాలుగేళ్లుగా అనధికార లాటరీ టిక్కెట్ వ్యాపారం కొసాగుతోంది. ఈ వ్యాపారం పట్టణానికే పరిమితమనుకుంటే పొరపాటే. పట్టణ కేంద్రంగా ఇతర జిల్లాలకు విస్తరించింది. నాలుగేళ్ళ క్రితమే పోలీసులు గుర్తించినా నియంత్రణలో చర్యలు శూన్యమే. పైగా చట్టంలో ఈ తరహా మోసాలకు పాల్పడేవారిని కనీసం రిమాండ్‌కు పంపే పరిస్థితి కూడా లేకపోవటంతో వారు బయం మీరిపోతున్నారన్న భావన పోలీసుల నుంచి వ్యక్తమౌతోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పట్టణ కేంద్రంగా నెంబర్ల లాటరీ వ్యాపారం జోరందుకుంది. దాదాపు కొన్ని సంవత్సరాలుగా ఈ వ్యాపారం జరుగుతుందన్నది వాస్తవం. ఎందుకంటే గతంలో అంటే 2019లోనే పోలీసుల దృష్టికి కూడా వచ్చింది. అప్పట్లో ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. అయితే అప్పట్లో హడావుడి చేసిన పోలీసులు తిరిగి దానిని నియంత్రించే ప్రయత్నం చేయలేదనే చెప్పాలి. ప్రస్తుతం దీనిలో అధికార పార్టీకి చెందిన వ్యక్తుల ప్రమేయం వేళ్ళూను కున్న నేపథ్యంలో వ్యాపారం జోరుగా సాగుతుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక నెంబర్ల లాటరీ విషయానికి వస్తే అంతా మోసమే. కేరళలో జరుగుతున్న కొన్ని ఆన్‌లైన్ లాటరీ టిక్కెట్ల తరహాలో తెనాలి కేంద్రంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో నంబర్ల లాటరీ కొనసాగుతోంది. లక్కు బాగుంటే లాటరీ ద్వారా లక్షాదికారులౌదామన్న ధోరణితో ఎందరో అమాయకులు ఏళ్ళతరబడి కష్టార్జితాన్ని ధారపోస్తున్నారు. పట్టణంలోని ప్రధానంగా మూడు కూడళ్ళలో లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం. టెలిఫోన్ ఎక్ఛేంజ్ రోడ్డులో ఓ కిళ్ళీ బంకులో, అలాగే మున్సిపల్ మార్కెట్ వెనుకనున్న ప్రభుత్వ మద్యం దుకాణానికి సమీపంలో, షరాఫ్ బజార్‌లో టిక్కెట్ల విక్రయం జరుగుతున్నట్లు సమాచారం. ఇవి కాకుండా మరి కొన్ని ప్రాంతాల్లోనూ వ్యాపారం సాగుతోంది. ప్రధానంగా సిక్కిం డేటా, సిక్కిం సూపర్, అరుణాచల్ లక్ష్మి, అరుణాచల్ వైష్ణవి పేరిట టిక్కెట్ల విక్రయం జరుగుతున్నట్లు తెలుస్తుంది. అన్‌లైన్ నెంబర్లంటూ ఆరు అంకెల నెంబర్లు గల స్లిప్పులను రూ.20, రూ.100, రూ. 500 చొప్పున విక్రయిస్తుంటారు. కేరళ నుంచి ఆన్‌లైన్‌లో విజేతల వివరాలు వెలువడతాయని, ఫలితాల్లో వెల్లడైన నెంబర్లకు, కొనుగోలు చేసిన నంబర్లకు బేరీజు వేస్తారు. వాటిలో అరంకెలు, ఐరంకెలు, నాలుగంకెలు, మూడంకెలు, రెండంకెలు కలిస్తే వివిద రకాల నగదు బహుమతులుంటాయి. వారు ప్రకటించిన విధంగా నెంబర్లు కలిస్తే టికెట్ ఖరీదుకు పది నుంచి 50 రెట్లు అధికంగా చెల్లిస్తారని చెబుతారు. టిక్కెట్ ధరను బట్టి కూడా చెల్లింపులున్నట్లు సమాచారం. ఉదాహరణకు రూ.100 టికెట్‌కు రూ.5వేలు, రూ.500 టిక్కెట్‌కు రూ.25వేలు ఇస్తామని చెబుతున్నట్లు సమాచారం. రోజువారి టిక్కెట్ విక్రయాలు, ప్రతి రోజు ఫలితాలు వెల్లడించటం నిత్యకృత్యం. వీరి మాటలు నమ్మి రోజుకు 300 నుంచి 400 మంది వరకూ టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. చివరికి నిర్వాహకుల వద్ద మిగిలిపోయిన నెంబర్లకు బహుమతులు లభించినట్లు ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారని, మోసపోయిన కొందరు ఆరోపిస్తున్నారు. వ్యసనపరుల బలహీనతలే పెట్టుబడిగా పెద్దమొత్తంలో తెనాలి వేదికగా వ్యాపారం సాగటం, దానిలో అధికార పార్టీ నాయకుల ప్రమేయం, పోలీసుల పాత్ర వంటివి చర్చనీయాంశంగా మారాయి.

గతంలో కేసులు నమోదు చేసిన పోలీసులు

నంబర్ల లాటరీ విషయం పోలసుల నోటీసులో ఉంది. ఎందుకంటే గతంలో నెంబర్ల లాటరీపై పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2019 జూలైలో నిర్వాహకుడితో పాటు ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేశారు కూడా. అప్పుడే లాటరీ దందా మొత్తం పోలీసులకు తెలిసిపోయింది. అయితే అప్పట్లో కేసు నమోదు చేసినా, తదుపరి దానిపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తెలిసి మిన్నకుండటంపై విమర్శలున్నాయి. అనధికారికంగా జరుగుతున్న నెంబర్ల లాటరీ దందా కేవలం సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంలో, అమాయకులను అసరాగా చేసుకుని సాగుతున్న వ్యాపారమేనని అప్పట్లో పోలీసులు వెల్లడించారు. క్రమంగా వేళ్ళూనుకుంటున్న దందాపై పోలీసులు వైఖరి విమర్శలకు తావిస్తోంది.

అదుపు చేయాలంటే చట్టం కఠినతనం కావాల్సిందే

కె.చంద్రశేఖర్, సిఐ, ఒన్‌టౌన్, తెనాలి.



నంబర్ల లాటరీ విషయం మా దృష్టికి వచ్చింది. గతంలో పరిస్థితి ఎలా ఉన్నా, ఇటీవల కాలంలో భాషా, సుబ్బారావు అనే ఇరువురిపై రెండు కేసులు నమోదు చేశాం. అయితే పేకాట, కోడిపందాలు, లాటరీలు వంటి వాటిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం నమోదు చేసే కేసులు. ఈ కేసుల్లో రిమాండ్‌కు పంపే పరిస్థితిలేదు. స్టేషన్ బెయిల్‌పై పంపించటమే. కఠినంగా వ్యవహరించే పరిస్థితిగాని, నింధితులు భయపడే పరిస్థితికాని లేదు. అందుకే పరిస్థితిలో మార్పు రావటంలేదు. చట్టాలు కఠినతరమైతే మినహా ఫలితం ఉండదు. అయినప్పటికీ ఈ వ్యవహారంపై నిఘా ఉంచుతాం. అరకట్టేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

సిపిఎం సీనియర్ నాయకుని తండ్రి కన్నుమూత

ప్రజాశక్తి-పెదనందిపాడు

సిపిఎం సీనియర్ నాయకులు కొత్తా శివనాగేశ్వరరావు తండ్రి సుబ్బారావు (90) గురువారం రాత్రి వారి స్వగ్రామం నాగులపాడులో కన్నుమూశారు. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం నాగులపాడులో జరుగుతాయని సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి డి రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్బారావు మృతి శాఖ తరుపున సంతాపం, వారి కుటుంబ సభ్యులు సానుభూతి తెలియజేస్తున్నామని రమేష్‌బాబు తెలిపారు.

ఉండవల్లి కరకట్ట మీద రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి కరకట్ట మీద మాజీ సిఎం చంద్రబాబు ఇంటి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తుళ్లూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు విజయవాడ నుంచి అమరావతి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వరంగల్‌కు చెందిన రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. విజయనగరంకు చెందిన గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు 108కి సమాచారం ఇచ్చి గణేష్‌ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వేగంగా వెళ్తున్న కారు టైరు పగిలిపోవడమే ప్రమాదానికి కారణమని తెలుస్తుంది. ప్రమాద తీవ్రతకు ద్విచక్ర వాహనం 20 అడుగుల మేర పైకి ఎగిరి పొలాల్లో పడింది. మృతిచెందిన, గాయపడిన ఇద్దరు యువకులు స్థానిక మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో విధులు నిర్వర్తిస్తారని తెలిసింది. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టిఖర్చులకు రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక గ్రామంలోని ఎస్‌టి కాలనీలో ఎం.మధురవాణి అనారోగ్యంతో గురువారం మరణించారు. ఆమె మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సంతాపం తెలిపారు. మట్టి ఖర్చుల నిమ్తితం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె భౌతిక కాయాన్ని స్థానిక వైసిపి నాయకలు బి.ప్రసన్నకుమార్, పులి భుజంగరావు సందర్శించి నివాళు లర్పించారు.

కాంద్రు వారి వీధిలో కుక్కల స్వైర విహారం

నాలుగేళ్ల చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి-మంగళగిరి : నగరంలోని కాంద్రు వారి వీధిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మొరిగే కుక్క కరవదు అంటారు. కానీ మొరగని కుక్కలే కాదు మొరగేవి సైతం కూడా పిక్కలు పట్టుకొని పీకుతున్నాయి. రాత్రి, పగలు అని తేడా లేకుండా వెంటపడి మరీ కరుస్తున్నాయి. పాదచారులనే కాదు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని సైతం వదలటం లేదు. శునకాల దెబ్బకు ఇంటి నుండి బయటకు రావాలంటే స్థానిక ప్రజలు భయపడే పరిస్థితి నెలకొని ఉంది. కుక్కల బెడద రోజు రోజుకి పెరిగిపోతుంది. గురువారం వీధి కుక్క ఓ నాలుగేళ్ల చిన్నారిపై దాడి చేసి కరవడంతో గాయాలయ్యాయి. ఇప్పటికైనా కార్పోరేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో పురుగు మందు తాగి మృతి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల : మద్యం మత్తులో పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణా రాష్ట్రంలోని మెదక్ జిల్లా నార్సింగ్ గ్రామానికి చెందిన సొంట ప్రభాకర్ మల్లగుల్ల మల్లమ్మ ఇరువురు గత కొంత కాలంగా పట్టణంలోని గాంధి నగర్‌లో సహజీవనం సాగిస్తున్నారు. ప్రభాకర్ గత కొంత కాలంగా మద్యం సేవించి నేను పురుగు మందు తాగి చనిపోతానని మల్లమ్మను భయపెట్టేవాడని, గురువారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మంది తాగడని, దీంతో స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారని, చికిత్స పొందుతూ ప్రభాకర్ మృతి చెందాడని ఆయన తెలియజేశారు. మల్లగుల్ల మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని టిడిపి నిరసన

ప్రజాశక్తి-నరసరావుపేట : ఓటమి భయంతో టిడిపి నాయకులపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కనుసన్నల్లో పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని నియోజకవర్గ భాద్యులు డాక్టర్ చదలవాడ ఎద్దేవా చేశారు. వైసిపి నాయకులు బెదిరింపు రాజకీయాలతో టిడిపి కార్యకర్తల పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేసానుపల్లి గ్రామంలో స్థానిక టీడీపీ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు శ్రీరామ నవమి వేడుకలు చేసుకుంటుంటే వైసిపి నాయకులు అక్కసుతో అక్రమ కేసులు పెట్టి వేది స్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శివరాత్రి కోటప్పకొండ తిరుణాల పండుగ సందర్భంగా కేసన పల్లిలో టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ప్రభపై వైసిపి వర్గీయులు దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టి 15 మంది టిడిపి నాయకుల పై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి రిమాండ్ కు పంపడం ఎమ్మెల్యే దుర్మార్గానికి నిదర్శనమన్నారు. టిడిపికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక, ఓటమి భయంతో పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమ అరెస్టులు చేయించడం సిగ్గు చేటని మండిపడ్డారు. రాష్ట్రంలో ఐపిసి సెక్షన్లు కాకుండా వైసిపి సెక్షన్లు అమల్లో ఉన్నాయని దుయ్యబట్టారు. టిడిపి కార్యకర్తల పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు పాలగని మల్లికార్జునరావు,సికినం అమర్నాథ్, పుచ్చకాయల బసవేశ్వరరావు, లింగాల లక్ష్మీనారాయణ, గద్దె నాగేశ్వరరావు, ముచ్చు వీరయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డాక్టర్ చదలవాడ, టిడిపి శ్రేణులు



మూసుకుపోయిన మట్టిరోడ్డు..

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని నందిగామ డొంక నుండి నందిగామ వరకు వున్న మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణం వల్ల మూడు కిలోమీటర్ల ప్రయాణ దూరం తగ్గుతుందని, రైతులు పంటలను ఇంటింటికి చేర్చుకునేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అమరావతి మేజర్ కాల్వకు ఇరు వైపులు వున్న పొలాలను వెళ్లడానికి రైతులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారని, ఆ మార్గంలో కంపచెట్ల పెరిగి దారంతా మూసుకుపోయిందని అంటున్నారు. ఇప్పటికే అమరావతి మేజర్‌పై వంతెన నిర్మించారని, నందిగామ డొంక నుండి మేజర్ వరకు, మేజర్ నుండి నందిగామ వరకు రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

డిపాజిటర్లకు అధిక వడ్డీ.. బంగారంపై ఎక్కువ రుణం

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కామేశ్వరరావు

నరసరావుపేటలో 247వ బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి-నరసరావుపేట

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ 247వ శాఖను పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఏర్పాటు చేశారు. స్థానిక సత్తెనపల్లి బైపాస్ రోడ్‌లోని బరంపేట 3 బావుల సెంటర్ వద్ద నూతన బ్రాంచ్‌ను బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన బ్యాంక్ సేవలను నరసరావుపేట పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులకు, బడుగు బలహీన వర్గాలకు చేయుతనిస్తున్నట్లు చెప్పారు. విద్యా, తనఖా, వ్యాపార, భూమిపై, బంగారు ఆభరణాలపై రుణ సదుపాయం ఉందని చెప్పారు. తమ బ్యాంకు ప్రస్తుతం నాలుగు ప్రాంతీయ కార్యాలయాలతో 247 శాఖల ద్వారా రూ.8070 కోట్లకు పైగా డిపాజిట్లు కలిగి ఉందని, రూ.9600 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేసిందని, రూ.200 కోట్లకు పైగా లాభాల్లో నడుస్తోందని తెలిపారు. శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కంటే చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో వడ్డీ ఎక్కువగా వస్తుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నరసరావుపేట రీజినల్ మేనేజర్ పి.మారుతీరామ్ మాట్లాడుతూ తమ బ్యాంకులోనే గ్రాముకు అత్యధికంగా రూ.4150 చొప్పున రుణాన్ని తక్కువ వ్యవధిలో ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అక్షర నర్సింగ్ హోం అధినేత డాక్టర్ ఎస్.రామ్‌ప్రసాద్, అడ్వకేట్ నంద్యాల సత్యనారాయణరెడ్డి, ఇంజినీర్ కె.కమలాకరరెడ్డి, బ్యాంకు హెడ్ ఆఫీస్ పి-డి ముఖ్య అధికారి కె.ఆంజనేయులు పాల్గొన్నారు.



జావగారిపోతున్న భోజన కార్మికులు

- రాగిజావ తయారీకి అదనంగా చాకిరీ, గ్యాస్ ఖర్చు
- పెరగని గౌరవవేతనం, బిల్లులు - ఊసేలేని 10 పైసల గుడ్డు బిల్లు
- రోజుకు ఐదారు గంటలు పని చేస్తే దక్కుతున్న గౌరవవేతనం రూ.100

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విద్యార్థులకు రోజుమార్చి రోజు అంటే మంగళవారం, గురువారం, శనివారం రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించి అమలు చేస్తోంది. దీని ప్రకారం మధ్యాహ్న భోజనంతో సంబంధం లేకుండా ఉదయం వేళే జావను కాచి విద్యార్థులు తరగతులకు వెళ్లక ముందే సిద్ధంగా ఉంచాలి. అయితే ఇది తమకు పనిభారంతోపాటు గ్యాస్ కూడా ఖర్చవుతుందని, అయినా విద్యార్థుల కోసం చేస్తామని, అందుకు తగిన వేతనం, గ్యాస్‌బిల్లులు మాత్రం ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

సోమవారం నుండి శుక్రవారం వరకు ప్రతిరోజూ విద్యార్థులకు ఉడిగించిన గుడ్డు పెట్టాల్సి ఉంటుంది. ఇందుకుగాను ఒక్కో గుడ్డుకు 10 పైసలు ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినా ఆ బిల్లులు రావడం లేదని మధ్యాహ్న భోజన నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికే గ్యాస్ ధర రూ.1200 వరకూ పెరిగి తాము తీవ్ర ఆర్థిక భారాలకు గురవుతున్నామని, తాజాగా రాగిజావ కాయడం మరింత ఆర్థిక భారమని అంటున్నారు. దీంతోపాటు రాగిజావను తరగతుల ప్రారంభానికి ముందే అందించాలంటే తాము ఉదయం 8 గంటలకే పని మొదలు పెట్టాల్సి ఉంటుందని, ఇది తమకు అదనపు చాకిరి కూడా అని చెబుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తమకు ఇచ్చే గౌరవవేతనం పెంచాలని, గ్యాస్ బిల్లు అదనంగా ఇవ్వాలని కోరుతున్నారు.

చిలకలూరిపేట పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలు 30 వరకూ ఉండగా వీటిల్లో 3 వేల మంది విద్యార్థులున్నారు. మండలంలో 54 పాఠశాలలకు గాను 4 వేల మంది విద్యార్థులున్నారు. వీరందరికీ దాదాపు 110 మంది మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం, రాగిజావను తయారు చేసి అందిస్తున్నారు. ఉదయం జావ కాయడానికి గంట సమయం పడుతుంది. ఆ పాత్రలను శుభ్రం చేసుకోవడానికి 15-25 నిముషాలు పడుతుంది. మధ్యాహ్నం భోజనం తయారు కోసం కూరగాయలు కట్ చేసుకోవడం, వాటితోపాటు బియ్యాన్ని కడిగి వండడానికి దాదాపు రెండు గంటలు పడుతుంది. అనంతరం అరగంటకుపైగా పిల్లలకు వడ్డించాక ఆ పాత్రలను శుభ్రం చేసుకోవడానికి మరో గంట పడుతుంది. ఇలా మొత్తంగా ఐదారు గంటలపాటు ఒళ్లు హూనం చేసుకుంటే వీరికి ఇస్తున్న గౌరవ వేతనం నెలకు రూ.3 వేలు. అంటే రోజుకు ఐదారు గంటలు కష్టపడుతుంటే వీరికి దక్కుతున్న మొత్తం రూ.100. తాము 15 ఏళ్లుగా పని చేస్తున్నామని, తొలుత రూ.వెయ్యి ఇవ్వగా కొద్దికొద్దిగా పెంచి ఇప్పుడు రూ.3 వేలు ఇస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.





ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందించే ఆహారం బలమైంది ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా... దీని తయారీలో కీలకమైన తమను విస్మరిస్తున్నారని, మా సమస్యలను అసలు పట్టించుకోవడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులను అంటున్నారు. గౌరవ వేతనం పేరుతో ఇచ్చే కొద్దిపాటి మొత్తం చాలక ఇబ్బంది పడుతుంటే ఇతర పదార్థాలనూ వండాలనే ఆదేశాలతో తమకు చాకిరితోపాటు ఖర్చు తడిసి మోపెడవుతోందని, దాన్ని ప్రభుత్వం ఇవ్వడం లేదని వాపోతున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



సత్తెనపల్లిలో భవన నిర్మాణ పని ప్రదేశాల్లో ప్రచారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 5వ తేదీన నిర్వహించే చలోఢిల్లీకి కార్మికులంతా తరలిరావాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని కార్మికుల పని ప్రదేశాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హరిపోతురాజు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రం కాలరాస్తోందని, ఇందుకుగాను లేబర్ కోడ్‌లను తెచ్చిందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించి హక్కులు, సంక్షేమ బోర్డును సాధించుకోవాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగా చలోఢిల్లీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చలోఢిల్లీకి కార్మికులు, కర్షకులు తరలిరావాలని సంఘాల పిలుపు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం మార్చ్ టు పార్లమెంట్‌లో పాల్గొనేందుకు 5వ తేదీన నిర్వహించే చలోఢిల్లీలో అన్ని రంగాల ప్రజలు పాల్గొనాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక పండరిపురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ. 10 వేలు అమలు చేయాలని కోరారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, టైం స్కేల్, స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు పంటలకు మద్దతు ధరలు, ఉపాధి హామీకి నిధుల పెంపు, ఏడాదిలో 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. వీటి సాధనతోపాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఇందులో బాగంగా చలోఢిల్లీకి అన్ని రంగాల ప్రజలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం.విల్సన్, ఎస్.బాబు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మిక, కర్షకుల చలోఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తెనాలి

రైతాంగ, కార్మిక సమస్యలపై వచ్చే నెల ఐదున తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను గురువారం స్థానిక ఐతానగర్ ఎర్రబడి వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు భరోసా కల్పించాలని, కేరళ తరహా రుణమాఫీకి చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమంలో రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేకల చిట్టిబాబు సుధాకర్ సంపెంగరావు, అత్తోట లక్ష్మయ్య ఈవూరు ప్రసాద్ రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పాలడుగు గ్రామంలో మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం జరిగింది. సిపిఎం నాయకులు బొట్ల రామకృష్ణ, వెంకటేశ్వర్లు ప్రచారం నిర్వహించారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి కోరారు.గురువారం రాజధాని గ్రామం వెంకటపాలెంలో ఛలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా రవి మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన నల్ల చట్టాలను తక్షణం ఉపసంహరించుకోవాల డిమాండ్ చేశారు. గ్యాస్, పెట్రోల్ , డీజిల్, మందులు, నిత్యవసర వస్తువు ల ధరలను తగ్గించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలైనా మార్చుకోవాలని ,లేదంటే ఈ ప్రభుత్వాన్ని మార్చేస్తా మనే నినాదంతో జరుగుతున్న ఢిల్లీ మహాప్రదర్శన బహిరంగ సభలో ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రవి కోరారు.

ఏప్రిల్ 5 వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సి ఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్య రాజు పిలుపు నిచ్చారు. గురువారం హైకోర్టు పారిశుధ్యకార్మికుల సమావేశంలో భాగ్యరాజు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5 న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

ప్రజాశక్తి - మంగళగిరి


ఏప్రిల్ 5వ తేదీన కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వం వ్యతిరేకంగా జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సెక్యూరిటీ గార్డ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు మోపిందని విమర్శించారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి మంగళగిరి ప్రాంతం నుండి కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిఐటియు నాయకులు టి శ్రీనివాసరావు, ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డ్స్ అసోసియేషన్ నాయకులు జి కోటేశ్వరరావు, పి శివశంకర్, పి సాంబశివరావు, ఆర్ రంగారావు, కే బుజ్జి బాబు పాల్గొన్నారు.



మంగళగిరిలో



తుళ్లూరులో



మేడికొండూరులో



తెనాలిలో

సామాన్యులపై పన్నుల భారం తగదు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సామాన్య ప్రజలపై అధిక పన్నుల భారం వేయడం తగదని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. బుధవారం రాత్రి ఎం టి ఎంసీ పరిధిలోని కుంచనపల్లి లో సిపిఎం నాయకులు అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన సమావేశంలో రామారావు మాట్లాడుతూ ఎం టి ఎంసీ పరిధిలోని తాడేపల్లి మండలంలోని విలీన గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దంటూ ఆయా గ్రామపంచాయతీలలో ప్రజలు ఆందోళన చేశారని అన్నారు. అయినప్పటికీ ప్రజల అభిప్రాయాలను పరిగణలకు తీసుకోకుండా పాలక పక్షమైన వైసీపీ మున్సిపల్ కార్పొరేషన్ లో గ్రామాలను విలీనం చేసిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో సామాన్య ప్రజానీకంపై అధిక పన్నులు భారం పడిందని ఆయన విమర్శించారు. ఇప్పటికీ విలీన గ్రామాలలో మంచినీటి సమస్యతోనూ, మురికినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయన దుయ్య బట్టారు. సరైన మౌలిక వసతులు కల్పించకుండా, విలీన గ్రామాలలో చెత్త పన్ను, నీటి పన్ను పేరుతో అధిక మొత్తంలో ఇంటి పన్నులను ప్రజల వద్ద నుండి వసూలు చేసేందుకు అధికారులు పూనుకోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. గతంలో పంచాయతీలుగా ఉన్న సమయంలో రూ.200 ఇంటి పన్ను వసూలు చేసిన అధికారులు, నేడు మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో సంవత్సరానికి రూ.600 వసూలు చేసేందుకు చర్యలు చేపట్టడం సిపిఎం పార్టీ వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. అంతేకాకుండా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి గ్రామాలను విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ అధికారులు పన్నులు వసూలు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాలలో సరైన ఉపాధులు లేక ప్రజల ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 1 నుండి ఇంటి పన్నులు చెల్లించని వారికి అధిక వడ్డీ తో చెల్లించాలని అధికారులు ప్రచారం చేయడం తగదన్నారు. తక్షణమే ప్రజలపై వేసే అధిక పన్నుల భారాన్ని ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, పల్లె కష్ణ, వడ్డేశ్వరం పున్నయ్య, అమ్మిశెట్టి రామారావు, కొండపల్లి యశోద తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

'చలో ఢిల్లీ'కి ప్రజా సంఘాల శ్రేణులు పయనం

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్రంలోని మోడీ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి గురువారం అర్ధరాత్రి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, సిఐటియు తదితర సంఘాల ఆధ్వర్యాన వందలాది మంది బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కె.కళ్యాణ్, సిఐటియు కృష్ణాజిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, నాయకులు కె.రమాదేవి, జి.కుమారి తదితరులు నేతృత్వంలో ఆయా సంఘాల శ్రేణులు బయలుదేరివెళ్లారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



విజయవాడ రైల్వే స్టేషన్లో చలో ఢిల్లీకి బయలుదేరి వెళతున్న ప్రజా సంఘాల శ్రేణులు, నాయకులు వి.కృష్ణయ్య, ఎం.హరిబాబు, వై.కేశవరావు, కళ్యాణ్ తదితరులు

సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలి

సెయిట్ ఆన్స్ మహిళా కాలేజీ సదస్సులో ఎఎస్‌పి

ప్రజాశక్తి - గుంటూరు

సామాజిక మాధ్యమాలతో జాగ్రత్తగా ఉండాలని విద్యార్థినులకు జిల్లా అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ సూచించారు. స్త్రీల సంరక్షణ, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీలో నిర్వహించారు. కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ డాక్టర్ ఫాతిమారాణి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎఎస్‌పి కె.సుప్రజ మాట్లాడుతూ ర్యాగింగ్ అనైతికమే కాకుండా దానికి పాల్పడ్డం వల్ల సమాజంలో గౌరవం కోల్పోతామని, జైలు పాలవుతామని హెచ్చరించారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ఉంటూ బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు జరిగే తీరు, వాటితో జాగ్రత్తగా ఉండాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో యువజన సేవ స్టెప్, స్వశక్తి ప్రతినిధులు ఎస్.పల్లవి, కిరణ్మయి, విజయలక్ష్మీ, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఉచిత వైద్యశిబిరం

సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీలో ఎన్ఎస్ఎస్, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య సహాయకులు రెవరెండ్ సిస్టర్ వ్యాకుళ బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు రావడానికి గల కారణాలను, పరిష్కాకాలను వివరించారు. విటమిన్లు, ప్రొటీన్లు, కార్బొహైడ్రేడ్లు ఉన్న ఆహారం తీసుకోవాలని చెప్పారు.



అడవితక్కెళ్లపాడులో ఎస్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - గుంటూరు

పారిశుధ్యం, దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ ఎన్ఎస్ వాలంటీర్లు ప్రత్యేక శిబిరాన్ని అడవితక్కెళ్లపాడులో గురువారం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ఇంటింటికీ వెళ్లి స్థానికులకు అవగాహన కల్పించారు. శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జెవి సుధీర్‌కుమార్ సందర్శించి విద్యార్థులను అభినందించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఐ.ఆదిలక్ష్మి, పీడీ జి.బాలశౌరెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

గాంధీ నాగరాజన్ నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయవాడ వన్‌టౌన్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని గురువారం నిరసన దీక్ష చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన్ను సాయంత్రం ఆరు గంటల సమయంలో అరెస్టు చేసి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీక్ష ప్రారంభం సందర్భంగా గాంధీ నాగరాజన్ విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం విషయంలో బిజెపి వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యబద్ధంగా లేదన్నారు. ఇది కేవలం రాహుల్ గాంధీ విషయం కాదని, ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని చెప్పారు.


చనిపోయిన ఎద్దు వద్ద రైతులు

విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని గోరంట్ల గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మద్దిగుంట్ల రామారావు ఇటీవల గురజాల సంతలో రూ.లక్షన్నర పెట్టి ఎద్దుల జతను కొన్నాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫారానికి అల్లుకున్న తిప్పతీగను తినేందుకు వెళ్లిన ఎద్దు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రెండు అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఇది విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని తన ఎద్దు మృతికి కారణమని, రూ.75 వేల నష్టం వాటిల్లిందని, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో శుక్రవారం ఉదయం 11 కౌన్సిల్ హాలులో నిర్వహిస్తామని చైర్మన్ ఎస్‌కె రఫాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 34 అంశాలపై చర్చించాల్సి ఉందని, కౌన్సిలర్లంతా హాజరవ్వాలని కోరారు.

నేడు అత్యవసర సమావేశం

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు గురువారం తెలిపారు.

పూజ సామగ్రి విక్రయ హక్కులకు నేడు వేలం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక కాశీవిశ్వేర స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునే హక్కుకోసం శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని దేవస్థానం ఇఒ ఎ.వెంకటేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.20 వేలు ధరావతు చెల్లించాలని, హిందువులు మాత్రమే వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలాన్ని దక్కించుకున్న వారు అప్పుడే నగదు చెల్లించాలని తెలిపారు.

'వరికపూడిసెలకు కేంద్రం అనుమతి పొందని అసమర్థ వైసిపి'

ప్రజాశక్తి - వినుకొండ

వరికపూడిసెల ప్రాజెక్టుకు కేంద్ర అటవీశాఖ నుండి అనుమతులు సాధించలేని అసమర్థులు వైసిపి నాయకులని బిజెపి నాయకులు ఎం.రమేష్ విమర్శించారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఢిల్లీ పెద్దల వద్దకు తరచూ వెళ్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అనుమతులు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఆధ్వర్యంలో పోరాడి కేంద్ర నుండి అనుమతులు తెస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు వెంకటయ్య, పేరయ్య, చిన్న నరసింహారావు, పాలడుగురాజు పాల్గొన్నారు.

నేడు వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కారెంపూడి

వైఎస్ఆర్ అసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహిస్తామని ఎంపిపి ఎం.శారద శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని, డిఆర్‌డిఎ పల్నాడు జిల్లా పీడీ బాలునాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని 944 డ్వాక్రా గ్రూపులకు రూ.6.94 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

పట్టణంలోని మార్కెట్ యార్డు నందు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ శుక్రవారం నిర్వహించనున్నట్లు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. పిడుగురాళ్ల అర్బన్, రూరల్, మాచవరం మండలాల్లోని మొత్తంగా 2179 డ్వాక్రా గ్రూపులకు చెందిన 21930 మంది మహిళలకు రూ.13.71 కోట్ల చెక్కులు అందించనున్నట్లు పేర్కొన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో 538 గ్రూపులకు గాను రూ.3.50 కోట్ల, మండలంలో 846 గ్రూపులకు రూ. 3.71 కోట్లు, మాచవరం 809 గ్రూపులకు గాను రూ.6.50 కోట్లను ఎమ్మెల్యే చెక్కుల ద్వారా అందిస్తారని తెలిపారు.

ప్రజాశక్తి-అచ్చంపేట

మండలం పరిధిలోని 971 డ్వాక్రా సంఘాలకు వైయస్సార్ ఆసరా మూడో విడత రూ.6.44 కోట్లు మంజూరైనట్లు వెలుగు ఎటిఎం సలీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు, అచ్చంపేటలోని పిహెచ్‌సి కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ద్వారా చెక్కులను డ్వాక్రా మహిళలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా విశ్వసాయి జూనియర్ కాలేజీ వార్షికోత్సవం



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని విశ్వసాయి జూనియన్ కాలేజీ 5వ వార్షికోత్సవం స్థానిక బ్రహ్మనాయుడు కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరవగా ప్రముఖ ఆంగ్ల అధ్యాపకులు రవికుమార్, బివి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బివి నాగేశ్వరరావు, విశ్రాంత హెచ్ఎం బి.జనార్ధనాచార్యులు, కౌన్సిలర్ షకీలా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వినుకొండ బీఈడీ కళాశాల డైరెక్టర్ గాలి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలేజీ మరింత అభ్యున్నతి సాధించాలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విద్యార్థులుసైతం క్రమశిక్షణతో మెలిగి లక్ష్యం సాధనకు కృషి చేయాలని చెప్పారు. ప్రిన్సిపాల్ యడవల్లి శ్రీవల్లి పావని, డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ విశ్వసాయి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మరో మహిళా జూనియర్ కళాశాల క్యాంపస్‌ను వచ్చే ఏడాది ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఐదేళ్లుగా తమ కాలేజీ విద్యార్థులు జాతీయస్థాయిలో ఐఐటి మెయిన్స్‌లో, రాష్ట్రస్థాయిలో ఎంసెట్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించడమే కాకుండా ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారని రాష్ట్రంలో అత్యుత్తమ పాస్ పర్సంటేజ్ సాధిస్తున్నారని అన్నారు. విద్యతో పాటుగా క్రీడలలో కూడా జాతీయ రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధిస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో ముందంజలో ఉన్నారని చెప్పారు. గతేడాది హెచ్‌సిఎల్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 32 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. మిగతా విద్యార్థులు ఉన్నత విద్యకి పలు ఉత్తమ కళాశాలలో సీట్లు సాధించి విద్యను అభ్యసిస్తున్నారని తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఇద్దరు విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోస్టల్ శాఖలో ఉద్యోగాలు సాధించారని, మిలటరీ ఉద్యోగం పొందారని చెప్పారు. తమ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసినవారు ఆంధ్ర యూనివర్సిటీ, వివిఐటి ఎస్ఆర్ఎం, భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల వంటి అత్యుత్తమ కళాశాలలో సీట్లు పొందారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఘనంగా నవమి వేడుకలు


సత్తెనపల్లి మండలం నందిగామ వేడుకల్లో వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మండలంలోని నందిగామలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు, మాజీ సర్పంచులు కొల్లా సుబ్బారావు, చెంబేటి బొల్లయ్య, ఉప సర్పంచ్ కొల్లా రమేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అచ్చంపేట

అచ్చంపేటలోని రాజీవ్ నగర్ కాలనీ వద్ద వడ్డెర యూత్ ఆధ్వర్యంలో గురువారం శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. వడపప్పు, పానకం పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.రాంబాబు, లక్ష్మణుడు, ఎస్.చిన్నోడు, ఎం.రాజా, ఎం.గోపి, కె.నాగ, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రమైనా ముప్పాళ్లలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోదండ రామస్వామి ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం కిషోర్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలు చేశారు. 75తాళ్లూరులో ఆలయానికి తాడిబోయిన వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం దంపతులు గుర్రపు వాహనాన్ని బహూకరించారు

పశువులకు హీట్ స్ట్రోక్... జాగ్రత్తలు

ప్రజాశక్తి-తిరువూరు

ఎండాకాలంలో అధిక వేడికి పశువులు హీట్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తిరువూరు మండలం వావిలాల పశువైద్యశాల డాక్టర్ శ్వేత అన్నారు. వేసవిలో పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వేడి కారణంగా పొలాల్లో గడ్డి కూడా ఎండిపోతుందని, తాగునీరు కూడా దొరకదని, ఈ పరిస్థితిలో పశువులు మేతకు, నీటికి అల్లాడుతుంటాయని తెలిపారు. ఈ క్రమంలో ఎండవేడికి తట్టుకోలేక హీట్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశముందని చెప్పారు. జంతువులకు తీవ్రమైన జ్వరం ఉంటే అవి వేడి స్ట్రోక్‌కు గురైనట్లు అర్థం చేసుకోవాలన్నారు. దీంతో పాటు జంతువు నోరు నుంచి ద్రావం కారడం, మేత మేయకపోవడం, చురుకుగా ఉండకపోవడం, ఎక్కువ నీరు తాగకపోవడం, మూత్రవిసర్జన ఆగిపోవడం మొదలైన లక్షణాలు ఉంటాయన్నారు. రైతులు ఆరు చర్యలు తీసుకోవటం ద్వారా పశువులు ఎండదెబ్బకి గురికాకుండా కాపాడుకోవచ్చన్నారు. పశువులను గాలి, వెలుతురు ఉన్న ఇంట్లో లేదా చెట్ల కింద ఎండ తగలకుండా చూసుకోవాలని తెలిపారు. పాకలలో గోనె సంచులను నీటిలో ముంచి కట్టాలని, తరచుగా వాటిని నీటితో తడుపుతూ ఉండాలని చెప్పారు. ఫ్యాన్, కూలర్ ఉపయోగించాలన్నారు. వేడి కారణంగా జీవులకు నాలుగు, ఐదుసార్లు చల్లటి నీరు ఇవ్వాలని, రోజుకు రెండు సార్లు చల్లటి నీటితో స్నానం చేయించడం ద్వారా అవి వేడిగాలుల నుంచి ఉపశమనం పొందుతాయన్నారు. ఉదయం ఐదు నుండి తొమ్మిది గంటలోపు, సాయంత్రం నాలుగు నుండి ఆరు గంటల్లోపు మేత సమయాన్ని పాటించవచ్చాన్నారు.





మంగళగిరిలో స్వచ్ఛ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి గౌతమ్ బుద్ధా రోడ్డులో నగరపాలక అధికారులు, ఆర్పిలు, ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు గురువారం స్వచ్ఛ మాషల్ మార్చ్ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం,పరిసరాల పరి శుభ్రత, తడి, పొడి, గృహ, ప్రమాదకర వ్యర్థాలు వేరు చేయడం, హోమ్ కంపోస్టింగ్ తదితర అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. అనంతరం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మానవహారం చేపట్టి, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. మంగళగిరి,తాడేపల్లి నగరపాలక సంస్థను ఆదర్శ వం తంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా కమిషనర్ యు.శారదదేవి కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రెటరీలు, ఆర్‌పిలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీదేవిపై అసభ్యకరపోస్ట్‌లపై వైసిపి దళిత నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి-మంగళగిరి

తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, వారి కుటుంబీకులపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టి, అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి వైసిపి దళిత నాయకులు ఫిర్యాదు చేశారు. దళిత మహిళ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఎమ్మెల్సీ ఓటింగ్ లో క్రాస్ ఓటింగ్ కు పాల్పడిందని ఆరోపిస్తూ వైసిపి నుండి ఆమెను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అసభ్యకర పదజాలంతో ఆమెను దూషిస్తూ సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బోరుగడ్డ అనిల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని, వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులు మధు రెడ్డి, నాగార్జున, అనిత్ రెడ్డి లపై ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆ ఫిర్యాదులో వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వైసిపి జిల్లా కార్యదర్శి ఈపూరి ఆదాం, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పచ్చల శ్యామ్‌బాబు, వైసిపి మహిళ విభాగం జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఈపూరి రవి, నిడమర్రు వైసిపి నాయకులు కట్టెపోగు బాబురావు, ఆంధ్రప్రదేశ్ మాదిగ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ కొదమల కుమార్, ఎంఎసిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతపూడి సాంబయ్య, ఎసి ఎస్ టి అట్రాసిటీ యాక్ట్ అధ్యక్షుడు పులి దాసు తదితరులు ఉన్నారు.

31న కెఎల్ బిజినెస్ స్కూల్ ఫెస్ట్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ విశ్వవిద్యాలయంలోని బిజినెస్ స్కూల్ ఎంబిఎ విభాగం జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవాన్ని ట్రాక్ష్యా అనే అంశంతో నిర్వహించనున్నట్లు ఎంబిఎ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమదివ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవంలో పాల్గొనే వారిలో నిర్వహణ నైపుణ్యాలు పెంపొందించాలనే లక్ష్యంతో ట్రాక్ష్యాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా టెక్ మహీంద్ర దక్షిణ భారతదేశ అధిపతి శ్రీనివాసరెడ్డి, గౌరవ అతిథిగా ఎంటర్ ప్రెన్యూర్ విజయ రాఘవలు హాజరవుతారని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ రంగంలోని నిపుణులు, ఎంబిఎ విద్యార్థులకు మెలకువలు తెలియ జేస్తారని తెలిపారు. మేనేజ్ మెంటు రంగంలో మెలకువలను తెలుసుకునే ఒక వేదికను కెఎల్ బిజినెస్ స్కూల్ అందిస్తోందని పేర్కొన్నారు.

అంతంతమాత్రపు సర్వీస్ రోడ్డు అధ్వానం!

పైపులైన్ పనులు పూర్తయ్యాక తవ్విన రోడ్డును అలాగే వదిలేసిన వైనం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరిలోని తెనాలి రోడ్డులో ఫ్లైఓవర్ పక్కన సరిగమ హోటల్ మీదుగా మంగళగిరికి వచ్చే సర్వీస్ రోడ్డు చిద్రమైపోయింది. తాగునీటి పైపులైన్ పనుల కోసం రహదారిని తవ్వి, అవి పూర్తయ్యాక రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దీంతో, అంతంతమాత్రంగా ఉన్న సర్వీసు రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. నెలలు గడుస్తున్న రహ దారి నిర్మాణానికి నగరపాలక సంస్థ అధికారులు ఎటు వంటి చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో రాకపోకల సమయంలో గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడు తున్నామని ద్విచక్ర వాహనదారులు చెబతుతున్నారు. మంగళగిరి నగరంలోకి ఫ్లైఓవర్‌కు అవ తలి వైపు నుండి వాహనాలు అపోజిట్ మార్గంలో రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత శాఖాధికారులు ఇకనైనా స్పందించి రోడ్డు నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మంగళగిరిలోని తెనాలి రోడ్డులో ఫ్లైఓవర్ పక్కన..



నాల్గో రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎయిమ్స్ లో నాలుగేళ్లుగా పనిచేసిన సెక్యూరిటీ గార్డ్స్ 71 మందిని అక్రమంగా తొలగించడానికి నిరసిస్తూ ఎయిమ్స్ సెక్యూరిటీ అసోసియేషన్ కమిటీ, సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వ ర్యంలో ఎయిమ్స్ గేటు వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి నాలుగో రోజు చేరాయి. దీక్షా శిబిరాన్ని ఎయిమ్స్ ఆటో యూనియన్ నాయకులు ఎం. వి సుబ్బారావు ప్రారంభించారు. అదేవిధంగా ఎఐటియుసి నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి, ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు మాట్లాడుతూ తొలగించిన సెక్యూరిటీ గార్డ్స్ ను వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు సంఘటితంగా ఉండి సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన చేయాలని, తాము పూర్తి మద్దతు తెలియజేస్తు న్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఐటియుసి నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్నవరపు ప్రభాకర్, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. దుర్గారావు, నాయకులు గంజి వెంకయ్య, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామారావు, బీసీ సంఘం నాయకులు నాగేశ్వరావు పాల్గొన్నారు. దీక్షా శిబి రంలో కె.వెంకట్రావు, టి.రాంబాబు, ఎం.ఆశీర్వాదం, ఎ.సుధాకర్ పాల్గొన్నారు. ఎయిమ్స్ సెక్యూరిటీ అసోసియేషన్ నాయకులు జి.కోటేశ్వరరావు, పి.శివశంకర్, పి.సాంబశివరావు, ఆర్.రంగారావు, కె.బుజ్జిబాబు పాల్గొన్నారు.


దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలుపుతున్న ఎఐటియుసి నాయకులు

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీరామ నవమి సందర్భంగా గోరంట్లలోని రామాలయంలో మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణు గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు, వేద సీడ్స్ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ కలిసి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ, తాళ్ళ వెంకటేష్ యాదవ్, తాళ్ళ నాగరాజు, కనకారావు, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మ,యర్రంశెట్టి సూరి తది తరులు పాల్గొన్నారు. **పొన్నూరు రూరల్:** పట్టణంలోని కాసుకర్రు రోడ్డులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరా మ నవమి నిర్వహించారు. **తాడేపల్లి:** తాడేపల్లి పట్టణంలోని వడ్డెర కాలనీ రామాలయం వద్ద 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్, కొత్తూరు రామా లయం, సీతానగరం జీయర్ ఆశ్రమం తదితర ప్రాంతాల్లో నవమి వేడుకలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని వెంకట్రావు, ఎ.మురళీ, సిహెచ్. సుబ్బారావు, ఇ.భాస్కర్, బి.రామ కృష్ణ, టి.భాస్కర్, కెటివి ప్రసాద్, టి.గోపి, కిరణ్, సాయి చంద్ తదితరులు పాల్గొన్నారు. సీతానగరంలోని కోదండ రామాలయంలో నవమి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కె. రాం బాబు, ఇఒ డి.భ్రమరాంబ, సీత డైరెక్టర్ బి.రామ చంద్ర రావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు, కె.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోరంట్లలోని రామాలయంలో అన్నదానం..


తాడేపల్లిలోని వడ్డెర కాలనీ రామాలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదానం



మున్సిపల్ కార్మికురాలికి సిఐటియు నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో మున్సిపాలిటీలో శానిటేషన్ కార్మికురాలుగా పనిచేస్తున్న ఎం.పద్మ (47) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఒక కుమార్తె ఉన్నారు. పద్మ భౌతికయంపై సిఐటియు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఆంధ్రప్రదేశ్ సెక్యూరిటీ గార్డ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రమేష్ బాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య, ఆంధ్రప్రదేశ్ కార్మిక సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, మున్సిపల్ యూనియన్ నాయకులు పి.పూర్ణ, ఎయిమ్స్ సెక్యూరిటీ అసోసియేషన్ నాయకులు జి.కోటేశ్వరరావు, శివ శంకర్, పి సాంబశివరావు, ఆర్ రంగారావు, కె.బుచ్చిబాబు ఉన్నారు.


చెంగల్ రాయుడు ని సత్కరిస్తున్న ఎస్ఐ అబ్దుల్ రెహమాన్

రైటర్ చెంగల్ రాయుడు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు పోలీస్‌స్టేషన్‌కు రైటర్ చెంగల్ రాయుడు అందించిన సేవలు ప్రశంసనీయమని ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ అన్నారు. చెంగల్ రాయుడు బదిలీపై గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న సందర్భంగా గురువారం రాత్రి వారిని పోలీస్ స్టేషన్ లో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు..



కీబోర్డు కళాకారుడు రాజభూషణంకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్ లో గురువారం ఎన్టీఆర్ నటించిన సీతారామకల్యాణం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారుణ్ణి సన్మానించే కార్యక్రమంలో పట్టణ పౌరాణిక నాటక, కీబోర్డు కళాకారుడు కట్టుపల్లి రాజభూషణం ను పార్టీ నాయకులు మాదాల కోటేశ్వరరావు, వెనిగళ్ల శివప్రసాద్, కుమారి సూజన్, బెల్లంకొండ వెంకట్, కొల్లవాసు, యలవర్తి బ్రహ్మం తదితరులు సత్కరించి ఎన్టీఆర్ జ్ఞాపిక అందించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ఎం.రాఘవరావు, డి భాస్కర్, ఎం వెంకట్, ఎన్ శ్రీనివాసరావు, వి సుభాష్ చంద్రబోస్, జేవి ఫణి, ఎస్ సాంబశివరావు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీకి నేటితో ముగియనున్న గడువు

ప్రజాశక్తి-గుంటూరు

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీకి 31వ తేదీ వరకే గడువు ఉన్నందున నేడు రాత్రి 11 గంటల వరకూ జిఎంసి క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, నగర ప్రజలు ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితిని పొందాలని తెలిపారు. 31న పన్ను చెల్లింపునకు వీలుగా రాత్రి 11 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పని చేస్తాయన్నారు. ఏక కాలంలో ఎక్కువ మంది పన్ను చెల్లింపునకు వస్తే సర్వర్ సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున ముందుగానే పన్ను చెల్లించాలని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148వ వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఉదయం ఉదయం 8 నుండి సాయంత్రం 8 గంటల వరకు పని చేస్తాయన్నారు. కావున ప్రజలు సకాలంలో పన్నులు చెలించి, నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రోల్ మోడల్‌గా చుట్టుగుంట జంక్షన్

చెరువు చుట్టూ క్రీడలు, వాకింగ్ : ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పనులను పరిశీలిస్తున్న అప్పిరెడ్డి

గుంటూరు నగర సమగ్రాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. చెన్నై, హైదరాబాద్ మహా నగరాల నుంచి గుంటూరు నగరంలోకి ప్రవేశించే చుట్టుగుంట జంక్షన్‌ను రాష్ట్రానికే ఒక రోల్ మోడల్‌లా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సంకల్పించినట్లు ఆయన వెల్లడించారు. పోలేరమ్మ తల్లి దేవస్థానం, గుడిని ఆనుకుని సహజ సిద్ధంగా ఏర్పడిన చెరువు అభివృద్ధితో పాటు దాని చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌ను ఆధునీకరించి, క్రీడలు, వ్యాయామం, యోగా చేసుకునేందుకు వీలుగా తీర్చిదిద్దడంపై ప్రత్యేకంగా దృఫింటసారించినట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, గురవయ్య, అందుగుల సంతోష్, ఈచంపాటి వెంకటకష్ణ(ఆచారి), పార్టీ నేతలు, స్థానికులు, కార్పొరేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి చుట్టుగుంట ప్రాంతాన్ని, వాకింగ్ ట్రాక్‌ను గురువారం సందర్శించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ చుట్టుగుంట జంక్షన్‌ను గుంటూరు నగరానికే మణిహారంలా మలచనున్నట్లు ఆయన వెల్లడించారు. వాకింగ్ ట్రాక్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్ది, చెరువు చుట్టూ ఉన్న ప్రాంతాన్ని క్రీడలు, వ్యాయామం, యోగా చేసేందుకు వీలుగా అభివద్ధి పనులు జరిపిస్తామని ఆయన వివరించారు. చెరువుకు రెండు ఘాట్‌లతో పాటు మధ్యలో మ్యూజిక్ ఫౌంటెన్, బోటింగ్, సీసీ కెమేరాలు, చుట్టూ మొక్కలు, చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్‌తో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగడి శ్రీనివాసరావు, కుమ్మర కోటేశ్వరరావు, అడకా శ్రీనివాసరావు, తుమ్మల నాగేశ్వరరావు, తమ్మినేని వెంకటరెడ్డి, రామ్‌లక్ష్మణ్, సురసాని వెంకటరెడ్డి, సింగు నరసింహారావు, చంద్ర, మిణుకూరి ప్రసాద్ బాబు, ఈ.ఈ. సుందర్రామిరెడ్డి, డి.ఈ.ఈ. రమేష్ బాబు, ఏఈ నాగవేణి, కాంట్రాక్టర్ శివయ్య పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురు నిందితులు అరెస్ట్

15 కిలోల సరుకు స్వాధీనం

వివరాలు వెల్లడించిన డిఎస్‌పి స్రవంతి రాయ్

ప్రజాశక్తి తెనాలి

గంజాయి కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పెద్ద మొత్తంలో 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణ టు టౌన్ పోలీస్ స్టేషన్ లో గురువారం డీఎస్పీ కే స్రవంతి రాయ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అయితానగర్ ప్యాడిసన్ పేటకు చెందిన ఐలా శ్రీనివాస్ అలియాస్ సాయి పాత నేరస్తుడు. గతంలో వివిధ కేసులలో నిందితుడిగా ఉన్నాడు. వ్యసనాలకు అలవాటు పడిన శ్రీనివాస్ ఈజీ మనీ కోసం గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నాడు. నర్సీపట్నంలో విష్ణు అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి, తెనాలిలో వ్యసనపరులకు విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన మరో ఐదుగురు యువకులతో కలిసి బుధవారం అయితానగర్ కమ్యూనిటీ హాల్ వద్ద గంజాయిని పొట్లాలుగా కడుతున్న సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు . శ్రీనివాస్‌తో పాటు నందుల పేటకు చెందిన దేవరకొండ మను శివశంకర్ అలియాస్ బబ్లూ, అలాగే ఐతానగర్‌కు చెందిన తాడికొండ చంద్రశేఖర్, తాడిపూడి సునీల్, పల్లె సంజయ్ అలియాస్ పాల్, వల్లభాపురం సునీల్ ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేజీ గంజాయిని రూ.500 చొప్పున కొనుగోలు చేసి, దానిని 10 గ్రాములు, 20 గ్రాములు పొట్లాలుగా కట్టి, 10 గ్రాముల పొట్లాన్ని రూ. 200కు వ్యసనపరులకు విక్రయిస్తున్నట్లు నిందితులు వెల్లడించారని తెలిపారు. అదుపులోకి తీసుకున్న ఆరుగురు నిందితులను కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డిఎస్పి చెప్పారు. చాకచక్యంగా నిందితులను అదుపులోకి తీసుకున్న సీఐ వెంకటరావు, ఎస్సై శివరామయ్య సిబ్బందిని ఆమె అభినందించారు. కాగా పట్టణంలో ఇంత



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి, వెనుక వరుసలో నిందితులు (ముసుగులో)

పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడటం చర్చనియాంశమయ్యింది. గతంలోనూ ఇదే తరహాలో గంజాయి విక్రేతలను పట్టుకుని కేసులు నమోదు చేసినా పరిస్థితిలో మార్పు లేకపోవడం, పైగా విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులలో కలవరం మొదలైంది.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : సిఐ

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక లైబ్రరీ సెంటర్లో ప్రయాణీకుల దాహం తీర్చేందుకు తాగునీటి కూలింగ్ చలివేంద్రంను ఏర్పాటు చేశారు. గురువారం చలివేంద్రాన్ని సిఐ ఎం ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లైబ్రరీ సెంటర్‌కు అనేక ప్రాంతాల నుంచి ప్రయాణీకులు, వివిధ వర్గాల ప్రజలు వస్తుంటారని, దాహం తీర్చుకునేందుకు చలివేంద్రం ఉపయోగ పడుతుందని అన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులను అభినందించారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్య రాజు మాట్లాడుతూ, మంచి నీటిని వృధా చేయవద్దని, ఎక్కువ ధర చెల్లించి కూల్ డ్రింక్స్ తాగి ఆరోగ్యం పాడుచేసుకునే బదులు చలివేంద్రం ద్వారా మంచి నీటిని తాగడం ఉత్తమమని అన్నారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ జెట్టి నరేంద్ర,



చలివేంద్రం ప్రారంభిస్తున్న సిఐ ఆనందరావు

దాసరి సాల్మన్ రాజు, డేవిడ్, బేతు రాజు, కొప్పుల యోహాను, సిఐటియు నాయకులు పేరం బాబూరావు, జెట్టి రమేష్ పాల్గొన్నారు.

పేదల మనిషి మాలకొండారెడ్డి

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపి - బటన్ నొక్కడం తప్ప పాలనెక్కడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం జిల్లా కార్యదర్శి రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పని చేసిన మాలకొండారెడ్డి పేదల మనిషి అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు నివాళులర్పించారు. సిపిఎం నాయకులు వెన్నపూస మాలకొండారెడ్డి 20వ వర్ధంతి సభ గురువారం సుందరయ్యనగర్‌లోని బత్తుల రాజు భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం బిజెపి ఫాసిస్టు పాలన సాగిస్తుందని విమర్శించారు. రాజకీయాల్లో మతాన్ని మిళితం చేయకూడదని స్పష్టంగా పేర్కొన్నా మతం పునాది మీద ప్రజల్ని చీల్చి బిజెపి అధికారంలోకి రాగలిగిందని దుయ్య బట్టారు. ఫెడరల్





మాట్లాడుతున్న పాశం రామారావు

వ్యవస్థను నాశనం చేసి, రాష్ట్రాల హక్కులను హరించివేసి, భాషా ప్రయుక్త రాష్ట్రాలను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల బలంగా ఉంటేనే కేంద్రం బలంగా ఉంటుందనే సూత్రాన్ని బిజెపి విస్మరించిందని చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల సేవల్లో మునిగిపోయిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు రైల్వేలు, ఎల్ఐసి, ఓడరేవులు అన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. మోడీ అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర రూ.446 ఉంటే నేడు రూ.1200 చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్, సిమెంటు, ఇసుక ధరలు పెరిగి కార్మికులకు పనుల్లేకుండా పోయాయని తెలిపారు. పేదవాడి ఇంటి నిర్మాణం కలగానే మిగిలిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. హిందూ సామ్రాజ్యవాదం పేరుతో బిజెపి చేస్తున్న మతోన్మాద రాజకీయాలు ప్రజలకు కడగండ్ల పాలు చేస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలోని వైసిపి పాలన కేంద్రం ఆడమన్నట్లు ఆడుతుందని ఎద్దేవా చేశారు. నవరత్నాలు పేరుతో బటన్ నొక్కడం తప్ప రాష్ట్రంలో పాలన ఎక్కడ ఉందని ప్రశ్నించారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల్లో భాగంగా



సుందరయ్యనగర్‌లో ర్యాలీ

విద్యుత్ వాడకం పేరుతో ఏప్రిల్ నుంచి కరెంటు ఛార్జీల పెంపుదల నిర్ణయాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. దళితపేటల్లో ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే పరిస్థితులు రాబోతున్నాయన్నారు. రాష్ట్రాల నుంచి జిఎస్‌టి పేరుతో వసూలు చేసిన డబ్బులు తిరిగి రాష్ట్రాలకు కేంద్రం ఇవ్వడంలేదని మండిపడ్డారు. సిఎం అనేకసార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా కేంద్రాన్ని నిలదీసి ఏమీ రాబట్టలేకపోతున్నారని చెప్పారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ప్రజాశక్తి బుక్‌హస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో వేలాది మంది పేదలకు ఇళ్లు వేయించి దీపాలు వెలిగించిన చరిత్ర సిపిఎందేనన్నారు. తాడేపల్లి ప్రాంతంలో వెలసిన పేదల కాలనీలన్నీ సిపిఎం ఆధ్వర్యంలో నిర్మాణం అయినవేనన్నీ స్పష్టం చేశారు. సుందరయ్య నగర్ ప్రాంతంలో ఏ కష్టం వచ్చినా మాలకొండారెడ్డి లాంటి వ్యక్తులు వెంటనే స్పందించేవారని చెప్పారు. సిపిఎం ఎదుగుదలను చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ గుండాలు ఆయన్ను పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. ఈ సభలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టె కరుణాకరరావు, నాయకులు పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నుంచి ప్రదర్శన

సిపిఎం నాయకులు మాలకొండారెడ్డి వర్ధంతి సందర్భంగా తాడేపల్లి బైపాస్ రోడ్డు నుంచి బత్తుల రాజు భవన్ వరకు సుందరయ్య నగర్ రెండు కిలోమీటర్ల మేర ప్రదర్శన నిర్వహించారు. మాలకొండారెడ్డి స్థూపం వద్ద నాయకులు పతాకావిష్కరణ చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అ సందర్భంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.